క్లుప్తంగా

రేపు మెగా వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సాయిరాం హాస్పిటల్ యాజమాన్యం ఎనగందుల నరేందర్, సురేష్ వారి సహకారంతో రేపు ఉచిత మెగావైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు వైద్యనిపుణులు డాక్టర్ ఎం.నరేష్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ జి వెంకటనారాయణలు వైద్యసేవలు అందించనున్నారు. రేపు ఉదయం 9గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, గ్రామపంచాయితీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. వివరాలకు 9030120777 ఫోన్ నంబర్‌కు సంప్రదించాల్సిందిగా కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: ఐదు విడతల కరువు భత్యం (డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క విడతని మాత్రమే విడుదల చేయడం, జీవో 317 సమస్యలపై దాటవేత వైఖరి ప్రదర్శించడాన్ని రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులంతా తీవ్రంగా నిరసిస్తున్నట్లు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బూటారి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తాటి సత్తిబాబు, ఉపాధ్యాయ దర్శిని సంపాదకవర్గ సభ్యుడు మునిగడప రామాచారి ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు విడతల కరువు భత్యం విడుదల చేస్తామని, పెండింగ్ బిల్లులు విడుదల చేసి సీపీఎస్ రద్దు చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కరువు భత్యంతో పాటు జీవో 317 సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరారు.

మాలల ఐక్యవేదిక అడ్‌హాక్ కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ శ్రీశ్రీనగర్‌లోని పద్మశాలి భవన్‌లో ఆదివారం మాలల ఐక్యవేదిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాలల హక్కుల సాధన, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు అనంతరం మాలల ఐక్యవేదిక అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా బూర్గుల సతీష్, వేర్పుల నరేష్, దాసరి వెంకటేశ్వర్లు, ములక నరేష్, నీలం పార్వతి, వేమూరి రవి, దాసరి వెంకన్న, తోట ప్రసాద్, బూర్గుల సంజీవరావు, పొలమూరి రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాలల అభ్యున్నతికి, మాలల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని కమిటీ సభ్యులు తెలిపారు. మాలల ఐక్యవేదిక సభ్యులు భద్రయ్య, శేఖర్, సురేష్, రవికుమార్, శ్రీనివాసరావు, వెంకట్, నాగేశ్వరరావు, ఇజ్రాయేల్, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ..

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలోని కోదండ రామాలయం, దుర్గా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పగడాల చిన్నప్ప అధ్యక్షతన ఆదివారం ఆలయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆలయ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. అనంతరం కమిటీ గౌరవ అధ్యక్షుడు, మాజీ వైస్‌ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారులు సానికొమ్ము దేవారెడ్డిల పర్యవేక్షణలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా మంగి వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి చంద్రమౌళి, కోశాధికారి మాదాడి రాజేష్, ప్రచార కార్యదర్శిగా వనచర్ల నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నన్నవేన రాజేష్, గెద్దాడ సాయిబాబా, పల్లాల లోహిత్, ఉపాధ్యక్షుడిగా నాగళ్ళ సత్యనారాయణ, తమటం గురువారెడ్డి, సహాయ కార్యదర్శులుగా కర్నె ధర్మయ్య, రెడ్డి సిద్దులులతో పాటు 17మంది సభ్యులను ఎన్నుకున్నారు.

వైద్య శిబిరం విజయవంతం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ (పీఎస్ఆర్)ఆధ్వర్యంలో భద్రాచలం కిమ్స్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. లక్ష్మీనగరం గ్రామం కిడ్స్ క్యాప్టివేషన్ స్కూల్లో జరిగిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో దాదాపు 300 మంది రోగులు పాల్గొనగా.. డాక్టర్లు షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ మేనేజ్మెంట్ భీమ్ రెడ్డి బాబు రెడ్డి, చావా శివరామకృష్ణ, హాస్పటల్ సిబ్బంది మార్కెటింగ్ టీం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సదుపాయాలు కల్పించాలి

చండ్రుగొండ: మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి స్వాతంత్ర పోరాటయోధులకు కల్పించిన సదుపాయాలు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. చండ్రుగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత బస్సు రవాణా సదుపాయం, ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. తొలుత ప్రదర్శన నిర్వహించారు. వరికూటి వెంకట్రావ్, కొండపనేని సత్యనారాయణ, పద్దం వెంకన్న, బాణోత్ బద్రు, తేజావత్ భీముడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెలుగు దివ్వెల సందడి

- మట్టితో చేసిన ప్రమిదలకు క్రేజ్
- మార్కెట్‌లో వెరైటీ డిజైన్లలో అమ్మకాలు
- చిరు వ్యాపారులకు ఉపాధి


కలశం రూపంలోని మట్టి ప్రమిద..


అమ్మకానికి ఉంచిన వివిధ రూపాల మట్టి ప్రమిదలు

భద్రాచలంఅర్బన్: దీపావళి పండుగ పూట కారు చీకట్లు పారదోలే వెలుగు దివ్వెలు చిరువ్యాపారులకు ఉపాధి కల్పిస్తున్నాయి. రెండు రోజుల్లో పండుగ సమీపిస్తుండటంతో భద్రాచలం మార్కెట్‌ను మట్టి దీపాలు ముంచెత్తాయి. మట్టితో తయారయ్యే అందమైన ప్రమిదలకు మరింత క్రేజ్ పెరిగింది. మైనంతో తయారయ్యే దీపాలు కాకుండా మట్టి ప్రమిదలను ప్రజలు కోరుకుంటున్నారు. దీంతో మట్టితో పాత్రలు తయారు చేసే కుమ్మరులు.. చిరు వ్యాపారులకు దీపావళి సీజన్ కలిసొస్తుంది. కొందరు వ్యాపారులు డిమాండ్ కు తగ్గట్టుగా ఇతర ప్రాంతాల నుంచి వెరైటీ డిజైన్లలో ఇంపోర్టెడ్ ప్రమిదలనే తెప్పిస్తున్నారు.

సీజనల్ ఉపాధి..

కార్తీకమాసంలో హిందువులు ఇంటి ముందు దీపాలు పెట్టడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మైనం దీపాలతో గతంలో ఆదరణ కోల్పోయిన మట్టి ప్రమిదలు ప్రజల్లో వచ్చిన చైతన్యంతో మళ్లీ వినియోగం పుంజుకుంది. దీంతో భద్రాచలం పరిసర మండలాల నుంచి ప్రజలు వచ్చి భద్రాచలంలో మట్టి పాత్రలు విక్రయిస్తున్నారు. వీరికి సీజనల్‌గా ఉపాధి దొరికినట్లైంది.

వెరైటీ డిజైన్లలో..

మట్టితో తయారైన అందమైన ప్రమిదలు వెరైటీ డిజైన్లలో లభిస్తున్నాయి. ఫైబర్, మట్టితో పాటు వివిధ రకాల లోహాలతో తయారైన ప్రమిదలు వచ్చాయి. నీటిలో తేలియాడే ప్రమిదలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భద్రాచలంకు గుజరాత్, కోల్‌కత్తా, పాండిచ్చేరి నుంచి వచ్చిన ప్రమిదలను ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేస్తున్నారు. మట్టితో తయారు చేసిన ప్రమిదలు డజన్ రూ.20 నుంచి రూ.60, వెరైటీలు రూ.50 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు.

ఇప్పటికే సందడి షురూ..

భద్రాచలం పట్టణంలోని కొత్త మార్కెట్, అంబేడ్కర్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, బ్రిడ్జి సెంటర్ ప్రాంతాల్లో ప్రమిదల కొనుగోళ్లు సందడిగా మారింది. మూడురోజుల్లో దీపావళి జరుపుకుంటున్న ప్రజలు రెండ్రోజులు ముందుగానే దీపావళి పూజా సామగ్రి, ప్రమిదలు, కొవ్వొత్తులు, నూనెలు కొనే పనిలో పడ్డారు. అదే విధంగా భద్రాచలం పరిసర ప్రాంత కస్టమర్లకు భారీ డిస్కౌంట్లు ఇచ్చి షాపింగ్ మాల్స్ ఆకర్షిస్తున్నాయి. పట్టణంలోని హోర్డింగ్‌లతో ప్రచారం చేస్తుండటంతో చుట్టు పక్క గ్రామాల నుంచి మాల్స్‌కు తరలివస్తున్నారు. అక్కడి ప్రమిదలను కొనుగోలు చేస్తున్నారు.

రూ.5 లక్షల పెట్టుబడితో..



ఈ ఏడాది దీపావళి, కార్తిక మాసం సందర్భంగా రూ.5లక్షలతో పెట్టుబడి పెట్టాను. ఇప్పటి వరకు రూ.3లక్షల వరకు అమ్మకాలు జరిగాయి. రానున్న రోజుల్లో ఈ అమ్మకాలు పెరుగుతాయని ఆశిస్తున్నాను. ప్రతి ఏడాది కొత్త వెరైటీలు విక్రయించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఎన్నో ఏళ్ల నుంచి భద్రాచలంలో ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాను.

– ఉపేందర్, ప్రమిదల వ్యాపారి, ఖమ్మం

కాంతులతో ఇంటిని అలంకరిస్తాం..



దీపావళి పండుగ ప్రత్యేకమైంది. ఇంట్లో లక్ష్మీదేవికి అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేస్తాం. ఇంటి చుట్టూ లోపల బయట దీపాలను వెలిగించి అలంకరిస్తాం. అదే విధంగా బొమ్మల కొలువును కూడా ఏర్పాటు చేసుకుంటాం. లక్ష్మీదేవి పూజ నిర్వహించిన తర్వాత మా కాలనీలోని మహిళందరం పసుపు కుంకుమలు ఇచ్చి పుచ్చుకుంటాం.

– లక్ష్మి, గృహిణి, భద్రాచలం

లక్ష్యం నెరవేరేనా..?

- నగం కూడా వసూలు కాని ఇంటి పన్నులు
- వేధిస్తున్న సిబ్బంది లేమి, పారిశుద్ధ్య సమస్యలు
- మణుగూరు మున్సిపాలిటీ తీరిది..


మణుగూరు మున్సిపాలిటీ..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యం చేరువయ్యేలా కనిపించడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించినా స్థానిక అధికారులు నిరంతరం ఇంటింటికి తిరుగుతున్నా వసూళ్లు అంతంత మాత్రంగానే కావడంతో పూర్తిస్థాయి వసూళ్లు ఈ సారి కష్టమే అన్న పరిస్థితులు నెలకొన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.1.40 కోట్లు రావాల్సి ఉండగా, ఏడు నెలలు గడిచినా రూ.65 లక్షలు మాత్రమే వసూళ్లు కావడంతో లక్ష్యం నెరవేరుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పన్నులపై పారిశుద్ధ్య ప్రభావం..

సిబ్బంది లేమి, కోట్ల విలువ చేసే చెత్త సేకరణ సామగ్రి చిన్న కారణాలతో మూలనపడటంతో మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య నెలకొంది. ఈ పరిణామాలు పన్నుల వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపతున్నాయి. పూర్తి స్థాయి వసూళ్ల కోసం అధికారులు నిరంతరం శ్రమిస్తున్నా ఫలితం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. 10 వేల జనాభాకి చెత్త సేకరణ, నీటి విడుదల తదితర అన్ని విభాగాల్లో 28 మంది సిబ్బంది పని చేయాల్సి ఉండగా, 20 వార్డులకు 35వేల జనాభా ఉన్న మణుగూరులో కేవలం 28 మంది మాత్రమే సిబ్బంది పని చేయడం కూడా పారిశుధ్య లోపానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

సగం కూడా వసూలు కాలే..

7 వేల పైచిలుకు ఉన్న నివాసాలకు ఏడాదికి రూ.1.40 కోట్లు వసూళ్లు కావాల్సి ఉండగా, పాత బకాయిలతో కలిపి రూ.2.21 కోట్లు 2025 మార్చి 31 వరకు వసూళ్లు కావాల్సి ఉందని గణాంకాలు చెబుతున్నాయి. అక్టోబర్ మాసం వరకు రూ.65 లక్షలు వసూళ్లు అయినట్లు తెలుస్తోంది. ఇంకా పాత బకాయిలతో కలిపి దాదాపు రూ.1.61 కోట్లు వసూళ్లు కావాల్సి ఉంది. పాత బకాయిలు మినహాయిస్తే ఈ ఏడాది వసూళ్లు ఇంకా ఐదునెలలే మిగిలి ఉన్నా.. ఇప్పటికి సగం కూడా వసూలు కాలేదని తెలుస్తోంది. జిల్లా అధికారులు, స్థానిక శాసన సభ్యులు దృష్టి సారించి మున్సిపాలిటీని గాడీలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ

బూర్గంపాడు: రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆదివారం ఖమ్మంలోని ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులు బిజ్జా వెంకటేశ్వర రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనకు ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శీనన్న రాజకీయంగా మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని, పేద ప్రజలకు బాసటగా నిలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మూల చిన్న ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ..

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ముందస్తుగానే భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఉన్న ప్రసూతి విభాగంలో ఉన్న బాలింతలకు ఆదివారం భద్రాచలం కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పాల్గొని పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవ చేయాలనే వ్యక్తి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అని, ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులంతా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు సరేళ్ల నరేష్, బలుసు సతీష్, భోగాల శ్రీనివాసరెడ్డి, అరికెల తిరుపతిరావు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు వెంకటేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.


భద్రాచలంఅర్బన్: ప్రసూతి విభాగంలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

మండలంలో ఎమ్మెల్యే పర్యటన


దమ్మపేట: వన దేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జారే దంపతులు

దమ్మపేట: మండల పరిధిలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని నల్లకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సమ్మక్క సారక్క ఆలయంలో ఎమ్మెల్యే జారే సతీసమేతంగా వన దేవతలను దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పట్వారిగూడెంలో పలు శుభ కార్యక్రమాలకు హాజరై, వధువరులను, చిన్నారులను దీవించారు. నాగుపల్లి గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన పాద్యా మహేష్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయం మూడో వార్షికోత్సవ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, దంపతులు హాజరయ్యారు. ఆదివారం జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా హాజరై ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇనుగంటి హరిబాబు, రాజు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

31న వాలీబాల్ టోర్నమెంట్

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దార్లగూడెం గ్రామంలో కుమ్రం భీం యూత్ ఆధ్వర్యంలో కొర్సా రమేష్ (పటేల్) జ్ఞాపకార్థం ఈ నెల అక్టోబర్ 31, నవంబర్1 తేదీల్లో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నీలో విజేతలకు మొదటి బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7,500, తృతీయ బహుమతి రూ.3,500, నాల్గో బహుమతి రూ.2 వేలతో పాటు ఈ నాలుగు స్థాయిల్లో షీల్డులు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 30వ తేదీలోపు తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం కొర్సా నరసింహారావు 6300038154, పాయం సుమంత్ 7981524194లను సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. ఇందులో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరుక్రాస్‌రోడ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు మోహరించి.. వచ్చిపోయే వారిని నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి విడిచిపెట్టారు. ఎస్సై నర్సిరెడ్డి, సివిల్, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలలో పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, సత్రపల్లి సాంబశివరావులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయితీ బోడేపూడినగర్‌లో జరిగిన గ్రామశాఖ మహాసభలో వారు మాట్లాడారు. తొలుత సీనియర్ నాయకులు కొరివి బసవయ్య పార్టీ జెండాను ఎగురవేశారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని అన్నారు. సరైన రోడ్లు, వీధిలైట్లు, మంచినీటి వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా ఎస్‌కె.కతిజాబేగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు దామల్ల లెనిన్ బాబు, బొల్లం రాజు, తోట పద్మ, ఎం నరసింహరావు, ప్రసాద్, కతిజాబేగం, ఫాతిమా, జ్యోతి, గౌరి, కోటయ్య, యాకుబ్, భద్రమ్మ పాల్గొన్నారు.

హత్యకు కారకులను శిక్షించాలి

గుండాల: గుమ్మడి మహేష్ హత్యకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకుడు వాగపోయిన చంద్రయ్యతో డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గార్ల మండలం సీతంపేట గ్రామంలో ఆదివాసీ చిరు ఉద్యోగి గుమ్మడి మహేష్ని అతి కిరాతకంగా హతమార్చడం చాలా దారుణమన్నారు. మహేష్ ఇంటి పక్కనే ఉంటున్న మంజుల–కృష్ణ దంపతులు మహేష్ దగ్గర రూ.4 లక్షల పైగా అప్పు చేశారని తెలిపారు. తమ డబ్బు తమకు ఇవ్వండి అని అడగ్గా హత్య చేసి మంజుల తన మీద అత్యాచారానికి పాల్పడినట్లు నింద మోపుతున్నారని అన్నారు.

అత్యాచారయత్నం చేస్తే బయట జరగాలి లేదా మంజుల ఇంట్లో జరగాలి కానీ మహేష్ ఇంట్లో ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. మహేష్ హత్యకు కారకులైన మంజుల తన భర్త కృష్ణ, సహకరించిన అందరినీ అరెస్ట్ చేసి జీవిత ఖైదు వేయాలని, అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహేష్ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

దూదేకులను ‘బీసీ–ఈ’లో చేర్చాలి


మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాషా

అశ్వారావుపేట: దూదేకులను బీసీ–ఈలో చేర్చాలని తెలంగాణ నూర్‌బాషా/దూదేకుల ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సూర్య స్కూల్‌లో జరిగిన సంఘ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దూదేకులను ముస్లిం జనాభాలో ప్రభుత్వాలు పరిగణించడం వల్ల వారు ప్రభుత్వ పథకాలు, హక్కులకు దూరమవుతున్నారన్నారు. నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వం చేయనున్న జనగణనలో అధికారులకు కులం పేరు దూదేకుల అని, మతం ముస్లిం అని చెప్పాలని సూచించారు. ముస్లింలు అని చెపితే దూదేకుల సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు షేక్ పకీర్ సాహెబ్ మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదేళ్లుగా ఎందరో మంత్రులు, చైర్మన్‌లను కలిసి సమస్యలను వినిపించినా పెడచెవిన పెట్టారని తెలిపారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రహీంబాషా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు షేక్ జానీ బేగం, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు షేక్ బాషా, షేక్ రాంజాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు, సింగిల్ విండో చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

గడిచిన ముప్పై ఐదేళ్లుగా సంఘ బాధ్యతలను నిర్వర్తించిన షేక్ పకీర్ సాహెబ్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నందున మండల కమిటీని నియమించి ఆయనే ప్రకటించారు. నూతన కమిటీకి అధ్యక్షుడిగా షేక్ బాజీ మాస్టర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ హుస్సేన్ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. వీరితోపాటు ఉపాధ్యక్షుడిగా షేక్ కరీం, సహాయ కార్యదర్శిగా షేక్ బాబు, ప్రచార కార్యదర్శిగా షేక్ మస్తాన్, కోశాధికారిగా షేక్ హుస్సేన్, ఈసీ మెంబర్లుగా షేక్ రహీం, షేక్ సైదులు, షేక్ మౌలాలిలను నియమించినట్లు షేక్ పకీర్ సాహెబ్ ప్రకటించారు.

డైవర్షన్ రోడ్డు సిద్ధం


డైవర్షన్ పనులను పరిశీలిస్తున్న తాండ్ర ప్రభాకర్‌రావు తదితరులు

ములకలపల్లి: ములకలపల్లి శివారు పాములేరు వాగుపై ఎట్టకేలకు డైవర్షన్ రోడ్డు సిద్ధం చేశారు. ఏడాది క్రితం ఈ వాగుపై నూతన వంతెన నిర్మించేందుకు శిథిలావస్థలకు చేరిన మినీ బ్రిడ్జిని కూల్చేశారు. వాగులో మోరీలు వేసి, తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు వేశారు. జూన్, జూలై మాసాల్లో కురిసిన భారీ వర్షాలకు పలుమార్లు డైవర్షన్ కోతకు గురైంది. దీంతో సుమారు పాదచారులు, ద్విచక్ర వాహనాలు ప్రయాణించేలా ఇనుప వంతెన నిర్మించారు. ఐతే ఆటోలు, ఇతర వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో తాళ్లపాయ జీపీ కేంద్రంతోపాటు పలు గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా అవస్థలు పడుతున్నామని, వర్షాలు తగ్గిన క్రమంలో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఇటీవల రాస్తారోకో చేసిన విషయం విదితమే. ధాన్యం. పత్తి చేతికొస్తున్న నేపథ్యంలో వెంటనే రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ తరుణంలో ఐటీడీఏ అధికారులు మూడు రోజులపాటు శ్రమించి డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేశారు. వాగుపై రాకపోకలను పూర్తి చేశారు. కాగా పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు ఆదివారం పరిశీలించారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు హుటాహుటిన డైవర్షన్ ఏర్పాటు చేసినట్లు తెలిపార్. ఖాదర్‌బాబా, సురబి రాజేశ్, పాలకుర్తి సుమిత్ ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కవాతు


కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) స్థాపించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 సంవత్సరాలలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం భారీ కవాతు నిర్వహించారు. స్నేహా గార్డెన్స్ వద్ద ప్రారంభమైన కవాతు సుందరయ్యనగర్, శ్రీశ్రీనగర్, అంబేడ్కర్ సెంటర్, పూలమార్కెట్ మీదుగా స్నేహగార్డెన్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జ్ వక్త శివరామకృష్ణ, బెజవాడ వెంకటేశ్వరరావు, సుమన్‌జీ, మూర్తి, వల్లభనేని నాగేశ్వరరావు, స్థానిక ముఖ్య నాయకులు పున్నం భిక్షపతి, లింగంపల్లి రమేశ్, పట్టణంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.